

భృతి.. భ్రమేనా?

'జాబ్ రావాలంటే బాబు రావాలి.. తమ్ముళ్లూ అవునా కాదా.. అధికారంలోకి వస్తే మీ కలలను సాకరం చేస్తా.. ఇంటికొక ఉద్యోగం ఇస్తా ఒకవేళ ఉద్యోగం ఇవ్వకపోతే ఉపాధి కల్పిస్తా.. మీరేమీ చదువుకోకపోయిన నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు అందిస్తా' అంటూ 2024 ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చేశారు. అయితే అధికారంలోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నా ఎక్కడా ఆ మాట ఎత్తడం లేదు. నిరుద్యోగులు మరచిపోయారని ఆయన భావిస్తున్నారు. అయితే నిరుద్యోగులు మాత్రం ఎప్పుడు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తాయా అంటూ ఎదురుచూస్తు న్నారు. అయితే ముఖ్యమంత్రి ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి ఊసే ఎత్తకపోవడంపై అంతా ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీల్లో నిరుద్యోగ భృతిని ప్రకటించిన సంగతి తెలిసిందే.

– తిరుపతి అర్బన్, రామచంద్రాపురం

- నిరుద్యోగ భృతి రూ.3వేలు ఊసేదీ...?
- ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
- అధికారంలోకి రాగానే ఇస్తామని హామీ
- పగ్గాలు చేపట్టి నెలరోజులైనా ప్రకటించని వైనం
- ఎప్పుడిస్తారో స్పష్టం చేయాలని నిరుద్యోగులు డిమాండ్
- 2014లా మోసపోవడం తథ్యమేనా?
- సీఎం స్పష్టత ఇవ్వాలంటూ పలువురు డిమాండ్

నిరుద్యోగ భృతి 2014లో గతేనా...

అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు పెద్దపీట వేస్తాం.. ఇంటికొక ఉద్యోగం కల్పిస్తాం.. లేకపోతే వచ్చే వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిని కల్పిస్తామని చంద్రబాబు ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుద్యోగ భృతిపై అంతా గంపెడాశలు పెట్టుకున్నారు. 2014 ఎన్నికల్లోను నిరుద్యోగ భృతి రూ.2 వేలు అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట మారచిపోయారు. ఉద్యోగాలు ఇవ్వలేదు...నిరుద్యోగ భృతికి పంగనామాలు పెట్టేశారు. 2019 ఎన్నికలకు నాలుగు నెలల ముందు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి యువనేస్తం పేరుతో కొద్దిమందికి మాత్రమే మొక్కుబడిగా రూ.వెయ్యి అందజేశారు. పదేళ్ల తర్వాత 2024 ఎన్నికల్లో అదే హామీ ఇచ్చారు. అయితే ఈ సారి మరో వెయ్యి రూపాయలను కలిపి నెలకు రూ.3 వేలు అందిస్తామని వెల్లడించారు. అయితే ఎక్కడా ముఖ్యమంత్రిగానీ, ఉప ముఖ్యమంత్రిగానీ, వారి మంత్రులు, ఎమ్మెల్యేలు భృతి విషయాన్ని ప్రస్తావించడం లేదు. దీంతో అందరికీ అనుమానాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సారి మోసం చేస్తే ఊరుకోబోమని...పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని నిరుద్యోగులు ఇప్పటికే పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

తిరుపతి నియోజకవర్గం సమాచారం

జనాభా	– 5.07లక్షల మంది
కుటుంబాలు	– 1.10లక్షలు
నిరుద్యోగులు	– 99,000 మంది
పీజీ, ఎంటెక్ చదివిన వారు	– 18వేల మంది
డిగ్రీ, బీటెక్, బీఈడీ చదివినవారు	– 42 వేలమంది
టీటీసీ చదివిన వారు	– 8 వేల మంది
వృత్తి విద్య, ఐటీఐ, డిప్లొమా వారు	– 14వేలు
ఇతరత్రా విద్యావంతులు	– 17 వేల మంది
వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శాశ్వత, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు పొందిన వారు	–13 వేలమంది

హామీలపై స్పష్టత కరువు

చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పేరుతో పలు హామీలు ఇచ్చారు. అయితే హామీలపై ప్రభుత్వం నుంచి స్పష్టత కనిపించడంలేదు. తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు అన్నారు. అయితే ఆ ఊసేలేదు. మత్స్యకారులకు భరోసా వేట నిషేధిత కాలంలో చెల్లించాల్సి ఉంది. ఆ మాటే చెప్పడం లేదు. మహిళలకు ఉచిత బస్సు అన్నారు...దానిపై మాట్లాడడం లేదు. ఉచితంగా ఇచ్చే గ్యాస్ సిలిండర్లపై మాట్లాడడం లేదు. టెన్త్, ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను గత ప్రభుత్వంలో అందించారు. దాన్ని పట్టించుకోవడం లేదు. చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీపైనా స్పష్టత ఇవ్వకుండా కాలం గడిపేస్తుండడంపై అంతా మండిపడుతున్నారు.

అమలుకు ఆమడ దూరం

భృతి కోసం నిరుద్యోగుల ఎదురుచూపులు



మండలం	కుటుంబాల సంఖ్య
రామచంద్రాపురం	8345
చంద్రగిరి	18357
తిరుపతి రూరల్	78146
పాకాల	18994
చిన్నగొట్టిగల్లు	9670
భాకరాపేట	10234
మొత్తం	143746

ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నా



నేను డిగ్రీ పూర్తి చేసి ఐదేళ్లయింది. ఎక్కడా ఉద్యోగ అవకాశాలు దొరకడం లేదు. చిన్నపాటి అంగళ్లలో పనిచేస్తే నెలకు రూ.7 వేల వరకు ఇస్తారు. వచ్చే జీతం చార్జీలు, భోజన వసతులకే సరిపోతున్నా యి. మిగిలిన నగదుతో నిత్యావసరాలు కూడా కొనలేని పరిస్థితి. నిరుద్యోగ భృతి లేదా ఉద్యోగం వస్తే కొంత మెరుగ్గా ఉంటుంది. – సెంథిల్, కుప్పంబాదూరు

భృతి కోసం ఎదురుచూస్తున్నా



ఎక్కడా ఉద్యోగం దొరకడం లేదు. ఇంటివద్దనే వ్యవసాయ పనులు చేసుకుంటూ అమ్మనాన్నలకు చేదోడు వాదోడుగా ఉంటున్నా. వ్యవసాయంలో కూడా పైసా మిగలడం లేదు. చంద్రబాబు ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలి. నిరుద్యోగ భృతి ఇస్తే బాగుంటుంది.

– గిరీష్, రామిరెడ్డిపురం

దూర ప్రాంతాలకు వెళ్లి తిరిగొచ్చా



చెన్నై, బెంగళూరు తదితర దూరప్రాంతాలకు ఉద్యోగ అన్వేషణకు వెళ్లి అక్కడే రూమ్ తీసుకుని ప్రయత్నాలు చేశాను. 5 నెలల్లో రూ.30 వేలు ఖర్చయింది కానీ ఉద్యోగం సంపాదించలేకపోయాను. ఇంట్లో వారికి అప్పులు మిగిల్చాను. చంద్రబాబు ఇచ్చిన మాట మేరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– కోటి, సొరకాయలపాలెం

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



నేను ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసి ఓ ప్రైవేటు పాఠశాలలో చాలీ చాలనీ జీతంతో పనిచేస్తున్నాను. ప్రభుత్వం ఏర్పాటై నెల గడుస్తున్నా నిరుద్యోగ భృతి అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. నిరుద్యోగులకు న్యాయం చేయాలి. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి.

– రుక్మాంగధరెడ్డి, నడవలూరు

ఉద్యోగాలు కల్పించాలి



చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి క్రమం తప్పకుండా ఉద్యోగాలు ఇస్తామని వెల్లడించారు. ఎంతో ఆశతో ఆయనకు ఓట్లు వేసి గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకుంటే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతారు. మరోసారి నమ్మరు. ప్రజలంతా నిరుద్యోగ భృతితోపాటు సూపర్‌సిక్స్ హామీలపై ఎదురుచూస్తున్నారు. స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. ప్రజల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబునాయుడుపై ఉంది.

- నారాయణ, తిరుపతి

2014లా చేసిన మోసం చేస్తే ఊరుకోరు



చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల సమయంలోను నిరుద్యోగ భృతి రూ.2 వేలు ఇస్తామని చెప్పారు. ప్రజలు నమ్మి ఓట్లు వేస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట నిలబెట్టుకోలేదు. అలానే చేద్దామని భావిస్తే ప్రజలు ఊరుకోరు. అప్పటి పరిస్థితులు వేరు. ఇప్పటి ఆలోచనలు వేరుగా ఉన్నాయి. ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చాల్సి ఉంటుంది. లేదంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

- జస్వంత్, తిరుపతి

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే...



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులు వచ్చేవరకు నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం మౌనంగా ఉంటే కుదరదు. ఒక్కో పథకాన్ని జారవిడుస్తున్నారు. ఎంత మంది బిడ్డలు ఉంటే అందరికి తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. ఒక బిడ్డ చదువుకుంటే ఇంకో బిడ్డ ఏం చేయాలి... అంతా చదువుకోండి అంటూ చంద్రబాబు పిలుపు ఇచ్చారు. ఇప్పుడు మాట మార్చుతున్నారు. అదేవిధంగా నిరుద్యోగ భృతి విషయంలోనూ మాట మార్పు చేస్తే కుదరదు.

- ప్రభాకర్, తిరుపతి

అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌తో పాటు బీజేపీ నాయకుడు జల్లి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి ఎస్‌పీ సింగ్ బఘేల్

మహాభారత ఉత్సవాలు ప్రారంభం

రామచంద్రాపురం: మండలంలోని పరమాల గ్రామంలో ధ్వజారోహణంతో బుధవారం మహాభారత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ గరుడ చిత్రంతో కూడిన ధ్వజ పటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్టించారు. అనంతరం ఆలయంలో కొలువైన శ్రీకృష్ణుడు, ద్రౌపది సమేత ధర్మరాజులకు ప్రత్యేక పూజలు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు స్వామి అమ్మవార్ల దర్శనభాగ్యంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బాల్య స్మృతులను అందించిన నగరం కథలు

తిరుపతి కల్చరల్: నగరం కథల ద్వారా రచయిత నాటి బాల్య స్మృతులలోని మధుర ఘట్టాలను నేటి తరానికి అందించారని ద్రావిడ వర్సిటీ వీసీ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి కొనియాడారు. పశు వైద్య కళాశాల ప్రొఫెసర్ వినోద్‌కుమార్ రచించిన నగరం కథలు పుస్తకావిష్కరణ సభ ఈ తరం కవిత వేదిక తోట వెకంటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం యూత్ హాస్టల్లో నిర్వహించారు. భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణరాజు నగరం కథలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కె.రామలక్ష్మి , ఎస్వీయూ తెలుగు విభాగం బ్రహ్మానందరెడ్డి, విశ్రాంత గణిత ప్రొఫెసర్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, మల్లేశ్వరరావు, ప్రముఖ కథా రచయిత కృష్ణస్వామిరాజు, ప్రముఖ రచయిత్రి అరుణకుమారి, పశువైద్య వర్సిటీ డీన్ డాక్టర్ రమణ, ప్రిన్సిపల్ జగపతి రామయ్య, సీనియర్ ప్రొఫెసర్స్ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ నళినికుమారి, డాక్టర్ గంగరాజు, డాక్టర్ వేణు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శాంతిలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోవిందయ్య, రచయిత సతీమణి డాక్టర్ గీతారెడ్డి పాల్గొన్నారు.



నగరం కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

పురోహితుల సంఘం గౌరవాధ్యక్షుడిగా శివకుమార్‌శర్మ



చంద్రగిరి: రాష్ట్ర పురోహితుల బ్రాహ్మణ సమాఖ్య ఉమ్మడి(చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి)జిల్లా గౌరవ అధ్యక్షుడిగా చంద్రగిరికి చెందిన డాక్టర్ ఆర్. శివకుమార్ శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర నాయకులు తెలిపారు. చంద్రగిరి పుట్టాలమ్మ ఆలయ ప్రధాన అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న శివకుమార్ శర్మ శైవాగమ, జ్యోతిష్య పండితులుగా సేవలను అందిస్తున్నారు. ఆయన గౌరవ డాక్టరేట్ సైతం పొందారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర సంఘం బుధవారం నిర్వహించిన సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాణ్యం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో శివకుమార్‌శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పురోహితుల బ్రాహ్మణ సమాఖ్య అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

క్లుప్తంగా

కేంద్ర మంత్రికి ఘనస్వాగతం

తిరుపతి గాంధీరోడ్: తిరుపతి పర్యటనకు విచ్చేసిన కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ భగేల్‌కు బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేవిధంగా చూడాలని మంత్రిని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్, చంద్రప్ప, జెల్లి మధుసూదన్, జనార్దన్ రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, మల్లారపు రవి ప్రసాద్, సుబ్రహ్మణ్యం యాదవ్, దీపక్ యాదవ్, జయంత్ కుమార్ పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ అసోసియేషన్ ఈసీ మెంబర్‌కు ఘన సన్మానం



ప్రదీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ లైబ్రరీ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.ప్రదీప్‌కుమార్ ఇటీవల వర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలలో భారీ మెజారిటీతో ఈసీ మెంబర్‌గా గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన్ను వర్సిటీ సిబ్బంది, నాన్‌టీచింగ్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ఉద్యోగ సంఘం అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి ఎస్.సుబ్రమణ్యం, ఉద్యోగులు కోలా మునికృష్ణ, పీకే సుబ్రమణ్యం, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండోలో టీటీడీ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని టీటీడీ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు తైక్వాండో జిల్లా స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ నెల 14వ తేదీన తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాల ఆడిటోరియంలో చిత్తూరు జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్– 2024 జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో శ్రీకోదండరామ, శ్రీ గోవిందరాజస్వామి, శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు రజత, కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలు పొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, టీటీడీ విద్యాసంస్థల తైక్వాండో శిక్షకుడు కె.గోపి నాయుడులను టీటీడీ విద్యాశాఖాధికారి

అంగన్‌వాడీల సమస్యలపై స్పందించాలి

తిరుపతి కల్చరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఏపీ ప్రగతి శీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ తెలిపారు. బుధవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చిత్తూరు ఉమ్మడి జిల్లాల ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. పి.వెంకటరత్నం, ఆర్.సుజాత, కల్పన పాల్గొన్నారు.

పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

తిరుపతి తుడా: పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని, ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని చేపల మార్కెట్, శంకర్ కాలనీ, మధురా నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రకాశం పార్కును హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి ఆమె బుధవారం పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ, పార్కుల నిర్వహణ సరిగా లేకపోవడంతో కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. మరోసారి నిర్వహణ లోపం తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కమిషనర్ మాట్లాడుతూ పార్కులలో చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ బాగుండాలని సూచించారు. తొలుత మధురా నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, శ్రావణి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్‌రెడ్డి, డీసీపీ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.



ప్రకాశం పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ అదితిసింగ్

స్విమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగులకు స్విమ్స్‌లో మెరుగైన వైద్యసేవలు అందించాలని టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ కోరారు. బుధవారం స్విమ్స్ ఆసుపత్రిలోని వైస్ చాన్స్‌లర్, డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి.కుమార్, డాక్టర్ రామ్, డాక్టర్ వివేక్, ఎంఆర్‌డీ మురళీలతో జరిగిన సమావేశంలో పలువురు టీటీడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. టీటీడీ నిధులతో నడుస్తున్న స్విమ్స్ హాస్పిటల్‌ను ఈహెచ్‌ఎస్ నుంచి మినహాయించి గతంలో ఉన్న విధంగా ఉద్యోగులకు, పెన్షనర్లకు ఉచిత సేవలు అందించాలని కోరారు. వంద పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో టీటీడీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆనందరాజు, డాక్టర్ నర్మద, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ యాదవ్, సభ్యులు హర్ష పాల్గొన్నారు.



స్విమ్స్ అధికారులతో సమావేశమైన టీటీడీ యూనియన్ నాయకులు

వైభవంగా శ్రీగోవిందరాజస్వామికి కవచ ప్రతిష్ట

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో జరుగుతున్న జ్యేష్టాభిషేకంలో భాగంగా రెండోరోజు బుధవారం స్వామివారికి కవచ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం శతకలశ స్నపనం, మహాశాంతి హోమం చేపట్టారు. అనంతరం ఆలయంలోని కల్యాణ మండపానికి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి కవచ ప్రతిష్ట చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ధనుంజయులు, రాధాకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తిరుచ్చిపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి

అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫ్లెక్సీల తొలగింపు

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగానున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఫ్లెక్సీలు కట్టి అవమాన పరచడం పాలకులకు తగదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత రాష్ట్ర అధ్యక్షుడు పి.అంజయ్య తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద కలుద్దాం... ఫ్లెక్సీలు తొలగిద్దాం కదిలిరండి పిలుపుతో ఆయన బుధవారం సాయంత్రం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎలాంటి ఫ్లెక్సీలు కట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంబేడ్కర్ భవన్ కమిటీ ప్రతినిధి డాక్టర్ గోపి, ప్రసాద్‌రావు, ఎస్సీ సంక్షేమ సంఘం నేత ధనశేఖర్, చిన్నం కాళయ్య, శ్రీను, కేవీపీఎస్ గోవిందయ్య పాల్గొన్నారు.



శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని మంగళవారం కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ భగేల్, తెలంగాణ మాజీ మంత్రి గంగుల కమలాకర్, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య, తెలంగాణ ఎమ్మెల్యే ఆదినారాయణ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

22న అప్పలాయగుంటలో పుష్పయాగం

తిరుపతి(అలిపిరి): అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జూలై 22వ తేదీ పుష్పయాగం నిర్వహించనున్నారు. జూలై 21న సాయంత్రం 6.30 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఆలయంలో జూన్ 17 నుంచి 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం విదితమే. ఈ ఉత్సవాల్లో ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జూలై 22న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి స్నపన తిరుమంజనం చేపడుతారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2.40 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగం కనులపండువగా నిర్వహిస్తారు. ఇందులో పలురకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. అనంతరం తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

శ్రీకపిలేశ్వరుని పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాలకు బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 18వ తేదీ గురువారం పవిత్ర ప్రతిష్ట, 19వ తేదీ శుక్రవారం గ్రంథి పవిత్ర సమర్పణ, 20వ తేదీన మహా పూర్ణాహుతి నిర్వహిస్తారు. చివరి రోజు సాయంత్రం 6 గంటలకు పంచమూర్తులైన శ్రీకపిలేశ్వరస్వామి, శ్రీకామాక్షి అమ్మవారు, శ్రీవిఘ్నేశ్వరస్వామి, శ్రీసుబ్రమణ్యస్వామి, శ్రీచండికేశ్వర స్వామివార్లకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ కృష్ణ వర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఉద్యమ రైతుల హామీలు అమలయ్యేలా చూడండి

- ఎంపీ గురుమూర్తికి ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి వినతి

తిరుపతి మంగళం: ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేలా చూడాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తిని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం వారు తిరుపతిలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ గురుమూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 2020–21 రైతు ఉద్యమం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రాత పూర్వక హామీలను అన్ని పంటలకు సి2+50 శాతం ప్రకారం మద్దతు ధరల చట్టం అమలు, రైతులు, వ్యవసాయ కార్మికులకు ఒకసారి రుణవిముక్తి చేసి వ్యవసాయ ఆత్మహత్యల నివారణ, వ్యవసాయానికి స్మార్ట్‌మీటర్ల రద్దు, అన్ని పంటలకు సమగ్ర పంటల బీమా, రైతులు, వ్యవసాయ కార్మికులకు పంటల బీమా, రైతు అనుకూల భూసేకరణ చట్టం తదితర హామీల అమలు కోసం పార్లమెంటులో చర్చించి కృషి చేయాలని ఎంపీని వారు కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ కరువు, అకాల వర్షాలు, వరదలు తదితర ప్రకృతి విపత్తులతో రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం అన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధరతోపాటు పంటల బీమా అవసరం ఉంటుందన్నారు. వ్యవసాయం చేస్తూ వయసు మళ్లిన రైతులకు పెన్షన్ విధానం ఏర్పాటు చేయాలని, రైతు కూలీల భవిష్యత్‌కు గ్యారెంటీ ఇవ్వాలని జీడీపీలో రైతుల సమస్యలకు సంబంధించి కచ్చితమైన వాటా ఉండాలని ఇలా పలు సమస్యలపై ఇప్పటికే కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిపారు. వాటితో పాటు ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి వారు చెప్పిన అంశాలపై పార్లమెంటులో చర్చించడమే కాకుండా సంబంధిత శాఖల మంత్రులతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ గురుమూర్తి తెలిపారు. రైతు సంఘాల నాయకులు రామానాయుడు, కేతారి రాధాకృష్ణ, మురళి, పెంచులయ్య తదితరులు ఉన్నారు.



ఎంపీ గురుమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు